# ఇండియన్ పాలిటీ

## భారత రాజ్యాంగ అభివృద్ధి (1858-1947)

**1857 సిపాయిల తిరుగుబాటు లేదా ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటం తర్వాత ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలన రద్దయ్యి, బ్రిటిష్ రాణి లేదా చక్రవర్తి (బ్రిటిష్ ప్రభుత్వం) ప్రత్యక్ష పాలన ప్రారంభమైంది. బ్రిటిష్ రాణి 1858 నవంబరు 1న 'భారతదేశంలో మంచి ప్రభుత్వం' పేరుతో ప్రకటన జారీచేసింది.**

### భారత ప్రభుత్వ చట్టం 1858

ఈ చట్టాన్ని బ్రిటిష్ పార్లమెంట్‌లో అప్పటి ప్రధాని పామర్‌స్టన్ ప్రవేశపెట్టారు. కానీ, ఇది పార్లమెంట్‌లో ఆమోదం పొందే సమయానికి 'లార్డ్ డెర్బీ' ప్రధాని అయ్యారు.

**ముఖ్యాంశాలు:**

★ కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ (కంపెనీ పాలకవర్గం), బోర్డ్ ఆఫ్ కంట్రోల్ (పిట్ ఇండియా చట్టం 1784 ద్వారా ఏర్పడింది) రద్దయ్యాయి. వీటి అధికారాలు నూతనంగా సృష్టించిన 'భారత రాజ్య కార్యదర్శి'కి బదిలీ అయ్యాయి. ఇతడిని బ్రిటిష్ రాణి లేదా చక్రవర్తి నియమిస్తారు. మొదటి కార్యదర్శి 'చార్లెస్ ఉడ్'.

★ భారత రాజ్య కార్యదర్శికి విధి నిర్వహణలో సలహాలు ఇవ్వడానికి 'కౌన్సిల్ ఆఫ్ ఇండియా' (లేదా) 'భారత వ్యవహారాల మండలి' ఏర్పడింది. ఇందులోని సభ్యుల సంఖ్య 15. దీని సమావేశాలకు భారత రాజ్య కార్యదర్శి అధ్యక్షత వహిస్తాడు.

★ భారతదేశ పరిపాలనకు సంబంధించిన అన్ని వ్యవహారాల పర్యవేక్షణ, నియంత్రణ, సూచనాధికారాలు భారత రాజ్య కార్యదర్శికి అప్పగించారు. ఇతడు బ్రిటిష్ క్యాబినెట్‌లో ఒక సభ్యుడు. భారతదేశ వ్యవహారాలపై బ్రిటిష్ పార్లమెంట్‌కు వార్షిక నివేదిక సమర్పిస్తాడు.

★ 'గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా' హోదాను వైస్రాయ్‌గా మార్చారు. ఇతడు బ్రిటిష్ రాణి లేదా చక్రవర్తికి భారతదేశంలో ప్రత్యక్ష ప్రతినిధిగా వ్యవహరిస్తాడు (భారతదేశంలో పరిపాలనాపరంగా గవర్నర్ జనరల్‌గాను, బ్రిటిష్ ప్రభుత్వంతో వ్యవహరించేటప్పుడు వైస్రాయ్‌గానూ వ్యవహరిస్తాడు). మొదటి వైస్రాయ్ లార్డ్ చార్లెస్ కానింగ్. వైస్రాయ్ పదవీకాలం 5 సంవత్సరాలు.

★ వైస్రాయ్, ప్రెసిడెన్సీల గవర్నర్లను నియమించే అధికారాన్ని బ్రిటిష్ రాణికి అప్పగించారు. గవర్నర్ జనరల్ కౌన్సిల్, ప్రెసిడెన్సీల కౌన్సిళ్ల సభ్యులను నియమించే అధికారాన్ని భారత రాజ్య కార్యదర్శికి, లెఫ్టినెంట్ గవర్నర్లను నియమించే అధికారాన్ని గవర్నర్ జనరల్‌కు ఇచ్చారు. అయితే ఈ నియామకాలను బ్రిటిష్ రాణి ఆమోదించవలసి ఉంటుంది.

### భారత కౌన్సిళ్ల చట్టం 1861

విక్టోరియా మహారాణి ప్రకటన లేదా భారత ప్రభుత్వ చట్టం 1858లో ఇంగ్లండ్‌కు సంబంధించిన అంశాలను మాత్రమే సూచించడం వల్ల భారత పాలనా వ్యవస్థలో పెద్దగా మార్పులు రాలేదు. కాబట్టి భారత కౌన్సిళ్ల చట్టం 1861 ద్వారా భారతదేశంలో పాలనా వ్యవస్థలో, ముఖ్యంగా శాసన మండళ్లలో అనేక మార్పులు తెచ్చారు. భారతీయుల సహకారం పొందడానికి బ్రిటిష్ ప్రభుత్వం 1861 నుంచి 1909 వరకు రూపొందించిన చట్టాలను భారత కౌన్సిళ్ల చట్టాలు అంటారు.

*ముఖ్యాంశాలు:*

★ భారతదేశంలో బ్రిటిష్ పాలన మొదలైన తర్వాత మొదటిసారిగా గవర్నర్ జనరల్ కౌన్సిల్‌లో భారతీయ ప్రతినిధులను నియమించే అధికారాన్ని గవర్నర్ జనరల్‌కు ఇచ్చారు. దీని ద్వారా శాసన నిర్మాణంలో భాగమయ్యేందుకు భారతీయులకు అవకాశం కలిగింది. కౌన్సిల్‌కు అనధికార సభ్యులుగా నామినేట్ అయిన వారు బెనారస్ రాజు (నారాయణ సింగ్), పాటియాల మహారాజు (నరేంద్రసింగ్), దినకరరావు.

★ గవర్నర్ జనరల్ కౌన్సిల్ లేదా కేంద్ర శాసన మండలిని విస్తరించారు. ఆరుగురికి తగ్గకుండా 12 మందికి మించకుండా అదనపు సభ్యులను (కేవలం శాసన నిర్మాణం కోసం నియమితులైనవారు) గవర్నర్ జనరల్ నియమిస్తాడు. అదనపు సభ్యుల్లో కనీసం సగం మంది అనధికార సభ్యులై (ప్రభుత్వ అధికారులు కానివారు) ఉండాలి. వీరి పదవీకాలం 2 సంవత్సరాలు.

★ గవర్నర్ జనరల్ కౌన్సిల్ శాసనాధికారాలను వికేంద్రీకరించి, బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీల కౌన్సిళ్లను పునరుద్ధరించారు (వీటిని చార్టర్ చట్టం 1833 ద్వారా రద్దు చేశారు).



R-8-12-16

★ గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలికి 5వ సభ్యుడిగా 'జూరిస్ట్' లేదా 'లామెంబర్'ను చేర్చారు.

★ భారత ప్రభుత్వంలో పోర్ట్‌ఫోలియో విధానాన్ని (ప్రత్యేకంగా ఒక్కో మంత్రికి ఒక్కో మంత్రిత్వశాఖను కేటాయించడం) మొదటిసారిగా ప్రవేశపెట్టారు.

★ గవర్నర్ జనరల్‌కు ఆబ్సల్యూట్ వీటో అధికారాన్ని ఇచ్చారు. అతని ఆమోదం లేనిదే కేంద్ర శాసనమండలి ఆమోదించిన బిల్లు చట్టం కాలేదు. రాష్ట్రాల్లో శాసనమండలి, గవర్నర్ల ఆమోదం పొందినప్పటికీ గవర్నర్ జనరల్ ఆమోదం పొందవలసి ఉంటుంది. ప్రెసిడెన్సీ ప్రభుత్వాలు పంపిన బిల్లును మార్చే అధికారం కూడా గవర్నర్ జనరల్‌కు ఉంది.

★ గవర్నర్ జనరల్‌కు ఆర్డినెన్స్‌లను జారీచేసే అధికారాన్ని ఇచ్చారు. దీని కాలపరిమితి 6 నెలలు. దీనికి శాసనంతో సమానమైన విలువ, అధికారాలు ఉంటాయి.

★ నూతన ప్రావిన్సుల (రాష్ట్రాల) ఏర్పాటు, విభజన, సరిహద్దులను మార్చే అధికారాన్ని గవర్నర్ జనరల్‌కు కల్పించారు.

★ రాష్ట్ర శాసన మండలికి నలుగురికి తగ్గకుండా, 8 మందికి మించకుండా 'అదనపు సభ్యులు'గా నియమించే అధికారం గవర్నర్లకు ఉంది.

★ వాయవ్య సరిహద్దు రాష్ట్రానికి, పంజాబ్‌కు శాసన మండళ్లను ఏర్పాటు చేశారు.

## భారత కౌన్సిళ్ల చట్టం 1892

భారత జాతీయ కాంగ్రెస్ 1885లో (స్థాపకుడు ఎ.ఒ. హ్యూమ్, మొదటి అధ్యక్షుడు డబ్ల్యు.సి. బెనర్జీ) స్థాపితమైన తర్వాత శాసన మండలి సభ్యుల సంఖ్యను, అధికారాలను విస్తరించాలనే డిమాండ్ ఎక్కువైంది. వారిని సంతృప్తిపరచడానికి ఈ చట్టాన్ని చేశారు.

**ముఖ్యాంశాలు:**

★ కేంద్ర శాసన మండలి, రాష్ట్రాల శాసన మండళ్ల సభ్యుల సంఖ్యను విస్తరించారు. కేంద్ర శాసన మండలిలో అదనపు సభ్యుల సంఖ్య 10కి తగ్గకుండా, 16కు మించకుండా ఉండవచ్చు. బెంగాల్, బొంబాయి, మద్రాసు శాసన మండళ్లలో అదనపు సభ్యుల సంఖ్య 8కి తగ్గకుండా, 20కి మించకుండా ఉండవచ్చు.

★ కొన్ని పరిమితులతో బడ్జెట్‌ను చర్చించడానికి కౌన్సిల్‌ను (6 రోజుల ముందస్తు నోటీసుతో) అనుమతించారు. మొదటిసారిగా భారతదేశ వ్యవహారాల్లో ప్రతి సంవత్సరం 'బడ్జెట్ సమావేశం' తప్పనిసరిగా నిర్వహించడం ప్రారంభమైంది.

★ ప్రజా ప్రయోజనమున్న అంశాలపై చర్చించే అధికారం శాసన మండళ్లకు కల్పించారు.

★ పరోక్ష ఎన్నికల ద్వారా అనధికార సభ్యులకు కౌన్సిళ్లలో ప్రవేశించే అవకాశం కల్పించారు. కేంద్ర శాసన మండలి సభ్యులను బెంగాల్ చాంబర్ ఆఫ్ కామర్స్, రాష్ట్ర శాసన మండళ్ల సభ్యులు ఎన్నుకుంటారు. రాష్ట్రాల శాసన మండళ్లకు సభ్యులను యూనివర్సిటీలు, జిల్లా బోర్డులు, మున్సిపాలిటీలు, జమీందార్లు, చాంబర్ ఆఫ్ కామర్స్ మొదలైనవి ఎన్నుకుంటాయి.

## భారత కౌన్సిళ్ల చట్టం 1909

దీన్నే మార్లే - మింటో సంస్కరణలు లేదా మింటో - మార్లే సంస్కరణలుగా పిలుస్తారు. మార్లే అప్పటి భారత రాజ్య కార్యదర్శి. మింటో అప్పటి వైస్రాయ్, గవర్నర్ జనరల్. ఈ చట్టాన్ని ప్రాతినిధ్య సంస్థల అభివృద్ధి క్రమంలో ఒక మైలురాయిగా చెప్పవచ్చు.

***ముఖ్యాంశాలు:***

★ కేంద్ర శాసనమండలి లేదా సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ పేరును 'ఇంపీరియల్ లెజిస్లేటివ్'గా మార్చారు. అదనపు సభ్యుల సంఖ్యను 16 నుంచి 60కి పెంచారు. అయితే, ఇందులో అధికార సభ్యులకే మెజారిటీ ఉంటుంది.

★ రాష్ట్రాల శాసన మండళ్లను విస్తరించారు. బొంబాయి, మద్రాసు, బెంగాల్, బిహార్, ఒరిస్సా, యునైటెడ్ ప్రావిన్స్‌ల్లో శాసన మండలిలో అదనపు సభ్యుల సంఖ్యను 50కి, బర్మా, అస్సాం, పంజాబ్ ప్రావిన్స్‌ల్లో 30కి పెంచారు. ప్రావిన్సుల్లో అనధికార సభ్యులకే మెజారిటీ కల్పించారు.

★ కేంద్ర, రాష్ట్ర శాసనమండళ్ల అధికారాలను విస్తరించారు. సభ్యులకు బడ్జెట్‌పై చర్చించడానికి, ప్రశ్నలు, ఉప ప్రశ్నలు అడగడానికి, తీర్మానాలను ప్రతిపాదించడానికి అధికారం ఉంది.

★ గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలిలో మొదటిసారిగా భారతీయులకు సభ్యత్వం కల్పించారు. మొదటి భారతీయ సభ్యుడు లార్డ్ సత్యేంద్ర ప్రసాద్ సిన్హా.

★ బొంబాయి, మద్రాసు, బెంగాల్ రాష్ట్రాల గవర్నర్ల కార్యనిర్వాహక మండలి సభ్యుల సంఖ్యను 2 నుంచి 4కు పెంచారు. అందులో

ఒక సభ్యుడు తప్పనిసరిగా భారతీయుడై ఉండాలి.

★ ఈ చట్టం ద్వారా 3 రకాల నియోజకవర్గాలను ఏర్పరిచారు.

ఎ) సాధారణ నియోజక వర్గాలు.

బి) వర్గ నియోజక వర్గాలు. ఉదాహరణకు మహ్మదీయులు, వ్యాపార వర్గాలు, జమీందారులు.

సి) ప్రత్యేక నియోజక వర్గాలు. ఉదాహరణకు ప్రెసిడెన్సీ కార్పొరేషన్లు, యూనివర్సిటీలు, పోర్ట్ ట్రస్ట్‌లు మొదలైనవి.

★ లార్డ్ మింటోను మత నియోజక వర్గాల పితామహుడిగా పేర్కొంటారు.

## భారత ప్రభుత్వ చట్టం 1919

దీన్నే మాంటేగ్ - చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు అని కూడా అంటారు. భారతదేశంలో నిజమైన బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో ఈ సంస్కరణలను ముఖ్యమైన మైలురాయిగా చెప్పవచ్చు.

***ముఖ్యాంశాలు:***

★ భారత రాజ్య కార్యదర్శి అధికారాలను కొంతవరకు (రాష్ట్రాలపై) తగ్గించారు.

★ భారత వ్యవహారాల మండలి లేదా ఇండియా కౌన్సిల్ సభ్యుల సంఖ్యను 12కు తగ్గించారు. పదవీకాలం 7 నుంచి 5 సంవత్సరాలకు తగ్గించారు.

★ భారత రాజ్య కార్యదర్శి, ఇండియా కౌన్సిల్ సభ్యుల జీతభత్యాలను భారత ఖజానా నుంచి కాకుండా బ్రిటిష్ ఖజానా నుంచి చెల్లించాలి.

★ మొదటిసారిగా ఇంగ్లండ్‌లో భారత హైకమిషనర్‌ను నియమించారు. మొదటి హైకమిషనర్ విలియం స్టీవెన్‌సన్

★ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాలను విభజించారు. అవశిష్ట అధికారాలను కేంద్ర ప్రభుత్వానికి అప్పగించారు.

★ కేంద్రంలో ద్విసభా విధానాన్ని ఏర్పాటు చేశారు. ఎగువ సభను 'కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్' అని, దిగువ సభను 'సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ' అని అంటారు. రెండింటికి దాదాపు సమాన అధికారాలను ఇచ్చారు. ఎగువ సభలో సభ్యుల సంఖ్య 60, దిగువ సభలో 145. ఎగువ సభ కాలపరిమితి 5 సంవత్సరాలు, దిగువ సభకు 3 సంవత్సరాలు. రెండు సభల్లోనూ ఎన్నికైన సభ్యులకే మెజారిటీ ఉంటుంది.

★ మొదటిసారి ప్రత్యక్ష ఎన్నికలకు శ్రీకారం చుట్టారు.

★ గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలిలో భారతీయుల సంఖ్యను 1 నుంచి 3కు పెంచారు. వీరికి విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, కార్మిక శాఖలను అప్పగించారు.

★ రాష్ట్ర స్థాయిలో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టారు. రాష్ట్రాల పాలనాంశాలను రెండుగా విభజించారు. అవి: రిజర్వ్‌డ్ శాఖలు (28), ట్రాన్స్‌ఫర్డ్ శాఖలు (22). రిజర్వ్‌డ్ శాఖలను గవర్నర్, గవర్నర్ కార్యనిర్వహక మండలికి అప్పగించారు. వీరు శాసన మండలికి బాధ్యత వహించరు. ట్రాన్స్‌ఫర్డ్ శాఖలను గవర్నర్ పర్యవేక్షణలో భారతీయ మంత్రులకు అప్పగించారు. వీరు శాసనసభలో సభ్యులై ఉంటారు. విధి నిర్వహణలో శాసన మండలికి బాధ్యత వహిస్తారు.

★ రాష్ట్రాల శాసన మండళ్లను విస్తరించారు. మొత్తం సభ్యుల్లో 70% ఎన్నికైన సభ్యులు ఉండాలి. మిగిలిన అధికార, అనధికార సభ్యులను గవర్నర్ నియమిస్తారు. శాసన మండలి కాలపరిమితి 3 సంవత్సరాలు.

★ భారతదేశానికి విడిగా ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను (లీ కమిషన్ సూచన ప్రకారం, 1926లో) ఏర్పాటు చేశారు. ఇందులో నలుగురు సభ్యులు, ఒక ఛైర్మన్ ఉంటారు.

★ భారత ఆడిటర్ జనరల్‌ను నియమించారు. ఇతన్ని నియమించే అధికారం భారత రాజ్య కార్యదర్శికి ఇచ్చారు.

★ కేంద్రం, రాష్ట్రాల మధ్య ఉత్పన్నమయ్యే వివాదాలను పరిష్కరించే అధికారం గవర్నర్ జనరల్‌కు ఇచ్చారు.

★ భారత ప్రభుత్వ చట్టం 1919 అమలు తీరును సమీక్షించడానికి 10 సంవత్సరాల తర్వాత చట్టబద్ధ కమిషన్ ఏర్పాటవుతుందని ప్రకటించారు.

**రచయిత: డాక్టర్ ఎం. భాస్కర రాజు**